ఎస్టీ, చెంచు తెగల రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు

# గిరి వికాసం



- గిరిజనుల బీడు భూములను సాగులోకి తెచ్చేందుకు గిరివికాసం పథకం అమలు
- వారి భూముల్లో బోరు తవ్వించి.. మోటరుతోపాటు విద్యుత్తు లైన్ వేసి సాగుకు యోగ్యంగా మార్చడం
- జిల్లాకు విడుదలైన రూ.2.88 కోట్లు.. ఇప్పటివరకు రూ.2.51 కోట్ల నిధులు ఖర్చు
- ఐదెకరాలకుపైగా ఉన్న 326 మంది రైతుల ఎంపిక
- గిరి వికాసం పథకం కింద 107 బ్లాక్‌ల అభివృద్ధి

వికారాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): గిరిజన తెగలకు చెందిన ఎస్టీ, చెంచులను ఆర్థికంగా బలోపేతం చేయడంతోపాటు వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే గిరిజనుల సంక్షేమానికి ఎన్నో రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. వారి భూములను సాగులోకి తీసుకొచ్చేందుకు గత ప్రభుత్వం గిరిజనుల బీడు భూముల్లో బోర్లు తవ్వించి బోరు మోటరుతోపాటు విద్యుత్తు లైన్ వేసి వాటిని సాగుకు యోగ్యంగా మార్చాలనే ఉద్దేశంతో గిరి వికాసం పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. బోరు తవ్వించడంతోపాటు బోరు మోటరు, పైపులు, విద్యుత్తు లైన్ తదితరాలన్నీ గిరిజన రైతులకు ఉచితంగానే కల్పిస్తున్నారు. అయితే ఐదెకరాలకు పైగా భూములున్న గిరిజనులను మాత్రమే సీఎం గిరి వికాసం పథకానికి అర్హులుగా ఎంపిక చేశారు. ఇప్పటికే జిల్లాలోని ఎంపీడీవోలు సంబంధిత మండలాల్లో ఐదెకరాలకు పైగా భూమి ఉన్న అర్హులైన గిరిజనులకు సంబంధించి 228 బ్లాక్‌లకు చెందిన 1.474 ఎకరాలను గిరివికాస్ పథకానికి జిల్లా యంత్రాంగం ప్రతిపాదించింది. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు సర్వే నిర్వహించిన అనంతరం 326 మంది రైతులను ఎంపిక చేశారు. ఐదెకరాలకుపైగా భూమి ఉన్న అర్హులైన గిరిజనులకు సంబంధించి గిరిజన రైతుల భూముల్లో బోర్లు తవ్వించి మిగతా వసతులను కల్పిస్తున్నారు. అలాగే జిల్లాలో ఎంపిక చేసిన బ్లాక్‌లోని గిరిజనుల భూములకు నీరందించి సాగులోకి తీసుకొచ్చేందుకు చర్యలు ముమ్మరం చేశారు. మరోవైపు జిల్లావ్యాప్తంగా షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారు 1,20,652 మంది ఉన్నారు.

### రూ.2.88 కోట్ల నిధులు విడుదల

గిరి వికాసం పథకంలో భాగంగా వికారాబాద్ జిల్లాకు ప్రభుత్వం రూ.2.88 కోట్ల నిధులను విడుదల చేసింది. ఇప్పటివరకు రూ.2.51 కోట్ల నిధులను జిల్లా యంత్రాంగం గిరిజన భూముల అభివృద్ధి కోసం ఖర్చు చేసింది. జిల్లావ్యాప్తంగా 228 బ్లాక్‌లను గుర్తించి 1,474 ఎకరాలకు గిరి వికాసం పథకానికి ప్రతిపాదనలను అందజేయగా, 180 బ్లాక్‌ల్లోని 1,200 ఎకరాలకు సంబంధించి సంబంధిత అధికారులు సర్వే ప్రక్రియను పూర్తి చేశారు. ఇప్పటివరకు 107 బ్లాక్‌ల్లోని 747 ఎకరాలకు సంబంధించి 326 మంది గిరిజన రైతులను గుర్తించి వారి భూముల్లో బోర్లు వేయించడంతోపాటు మోటర్లు బిగించి, విద్యుత్తు లైన్ ఏర్పాటు చేయడంతోపాటు మిగతా సౌకర్యాలను గిరిజన రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. మరోవైపు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా భూ అభివృద్ధి పనులు, బోర్‌వెల్ రీచార్జ్ గుంతలు, పండ్ల తోటల పెంపకం, గట్లపై టేకు మొక్కల పెంపకం, పశువుల పాక, మేకలు, గొర్రెల పాక, కూరగాయల పందిరి, కంపోస్ట్ పిట్‌లు ఇస్తున్నారు. ఉద్యానవన శాఖ ద్వారా జీవనోపాధుల పెంపుదలతోపాటు డ్రిప్, స్ప్రింక్లర్ పైపులను పంపిణీ చేయడంతోపాటు వ్యవసాయ శాఖ ద్వారా విత్తనాలు, పరికరాలను సబ్సిడీ ద్వారా పంపిణీ చేస్తున్నారు. గిరి వికాసం పథకంతో ఎస్టీలను, చెంచులను ఆర్థికంగా అభివృద్ధిలోకి తీసుకురావడంతోపాటు వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిన చెంచులు, గిరిజనులు తిరిగి వచ్చేలా చర్యలు చేపట్టారు.

### రూ.2.51 కోట్ల నిధులు ఖర్చు

అర్హులైన గిరిజన రైతులను ఇప్పటికే ఎంపిక చేశాం. సంబంధిత రైతుల భూములను సాగుకు యోగ్యంగా తీసుకొచ్చేందుకు అవసరమైన పనులు జరుగుతున్నాయి. ఇప్పటివరకు 107 బ్లాక్‌ల్లోని గిరిజన భూముల్లో బోర్లు, మోటర్లు బిగింపు, విద్యుత్తు లైన్ తదితర పనులకు రూ.2.51 కోట్ల నిధులను ఖర్చు చేశాం. గిరి వికాసం పథకంతో చాలా గిరిజన కుటుంబాలు రూపాయి ఖర్చు లేకుండా వారి బీడు భూములను సాగులోకి తీసుకురావడంతోపాటు ఆర్థికంగా బలోపేతం అయ్యారు.

**- ఎంఏ.కృష్ణన్, డీఆర్‌డీవో, వికారాబాద్**

### గిరిజనుల భూములు సాగులోకి...

గిరిజనుల అభ్యున్నతి కోసం బీడు, సాగు భూములకు ఉమ్మడి నీటి వినియోగ వసతులను కల్పిస్తూ వారి జీవన స్థితిగతులను పెంపొందించేందుకు గిరి వికాసం పథకాన్ని తీసుకొచ్చారు. గిరిజన తెగలకు చెందిన ఎస్టీ, చెంచులకు సంబంధించిన చిన్న, సన్నకారు రైతుల భూ ములను సాగులోకి తీసుకొచ్చేందుకు ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ఈ పథకంలో భాగంగా కనీసం ఇద్దరు అంతకు మించి ఎక్కువ మంది రైతులకు సంబంధించి కనీసం 5 ఎక రాలకుపైగా పొలం కలిగి ఉన్న గిరిజన రైతులు తమ ప్రతిపాదనలను స్థానిక సంబంధిత అధికారులకు అందజేయాలి. మండల స్థాయిలో సంబంధిత పథకం పర్యవేక్షణతోపాటు లబ్ధిదారుల ఎంపికకు మండల స్థాయిలో తహసీల్దార్, విద్యుత్తు ఏఈ, ఎంపీడీవోలతో కమిటీ గిరి వికాసం పథకం కోసం ప్రతిపాదించిన భూమిపై ఎలాంటి వివాదాలు లేవని ధ్రువీకరించాల్సి ఉంటుంది. సాగును దృష్టిలో పెట్టుకొని ఒక్కో బ్లాక్‌లో నిర్ణయించిన భూములకు సరిపడా సాగునీటిని అందించేలా బోరు వేయిస్తున్నారు. విద్యుత్తు సౌకర్యం, మోటర్ పంపు, పైపులు తదితరాలు ఉచితంగానే అందజేస్తున్నారు. అలాగే ప్రతిపాదించిన బ్లాక్ సమీపంలో చెక్‌డ్యాంలు, రాక్‌పిల్‌డ్యాం తదితర భూగర్భజల వనరులు పెంపొందేలా చర్యలు చేపట్టారు. జియాలజిస్టులతో తొలుత సర్వే చేయించి వారి నివేదికల ఆధారంగానే ఎక్కడ భూగర్భ జలాలు ఉన్నాయో ఆ భూముల్లోనే బోర్లు వేయిస్తున్నారు. బోర్లు తవ్వించి, విద్యుత్తు సౌకర్యం ఇప్పించడంతో పాటు మిగతా శాఖల ద్వారా అవసరమైన వసతులను కల్పిస్తున్నారు. ఉద్యానవన శాఖ ద్వారా బిందు సేద్యాన్ని గిరిజనుల భూముల్లో ఏర్పాటు చేయిస్తున్నారు.





తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి సోమవారం వేర్వేరుగా హైదరాబాద్‌లోని సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. **- వికారాబాద్, డిసెంబర్ 18**

## జిల్లా ప్రిన్సిపల్ జడ్జిని కలిసిన సీపీ

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 18 : రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి, మెట్రోపాలిటన్ జడ్జి శశిదర్‌రెడ్డిని సోమవారం రాచకొండ సీపీ సుధీర్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. పోలీస్ కమిషనర్‌గా సుధీర్‌బాబు నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జడ్జిని కలిసి రాచకొండ పరిధిలో డ్రక్స్ సరఫరా... వినియోగంపై తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. అనంతరం డ్రగ్స్ కేసును విచారణ చేసేందుకు అనుభవజ్ఞుల సూచనలు మెళకువలు కలిగిన పుసకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అనంతరం జిల్లా మెట్రోపాలిటన్ సెషన్ జడ్జిని కలిశారు. కార్యక్రమంలో పీపీ రాజిరెడ్డితో పాటు పలువురు పోలీసు ఉన్నతాదికారులు ఉన్నారు.



జిల్లా ప్రిన్సిపల్ జడ్జి శశిధర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీపీ సుధీర్‌బాబు




శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో సోమవారం ప్రముఖ సినీ నటి రష్మీ సందడి చేశారు. స్థానిక వ్యాపార సముదాయమైన కాసం వస్త్ర షోరూంను సోమవారం ఆమె ప్రారంభించారు.

**- శంకర్‌పల్లి, డిసెంబర్ 18**

## పీజీ డిప్లొమా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 18 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ విదేశీ భాషల పీజీ డిప్లొమా కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రెంచ్, జర్మన్ భాషల పీజీ డిప్లొమా కోర్సుల పరీక్షలను గత నెలలో నిర్వహించామని, ఆ పరీక్షల ఫలితాలను విడుదల చేశామని చెప్పారు. www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## 20న డైట్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన

**ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామాచారి**



వికారాబాద్, డిసెంబర్ 18 : ఉమ్మడి రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో డీఈఈ సెట్ 2023–25 రెండు సంవత్సరాల కోర్సులో చేరేందుకు మరో విడుతగా ఈ నెల 20న వికారాబాద్‌లోని డైట్ కళాశాలలో సర్టిఫికెట్లను పరిశీలిస్తున్నట్లు ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి 27 వరకు వెబ్‌ఆప్షన్లు నమోదు చేసుకోవాలని, 30న సీట్లు కేటాయిస్తామన్నారు. 2024 జనవరి 1 నుంచి 3వ తేదీ వరకు ఫీజు చెల్లించాలన్నారు. 5న అలాట్‌మెంట్ లెటర్‌తో సీటు అలాట్ అయిన కళాశాలలో ఒరిజినల్ ధ్రువపత్రాలను సమర్పించి రిపోర్ట్ చేయాలని తెలిపారు. జనవరి 8 నుంచి కేటాయించిన కళాశాలకు హాజరు కావాలని ఆయన కోరారు.

## సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 18 : ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భారతీ హోళీకేరి సంబందిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లా అధికారులు క చ్చితంగా హాజరు కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి పరిష్కారానికి ప్రా ధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి వాటిని పరిశీలించేందుకు సంబంధిత అధికారులను ఆదేశించాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై కొంత మంది అధికారులు స్పందించడం లేదన్నారు. ఇకనుంచి స్పందించని అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజావాణిలో 170 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబందిత శాఖ అధికారులకు పంపించి వాటిని పరి ష్కరించేలా చూడాలని డీఆర్వోను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, డీఆర్వో సంగీత తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ భారతీహోళీకేరి